

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా




సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 246 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 02, ఆగస్టు 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# స్థానికత లోపం శాసిస్తుంది

వైద్య సీట్ల కేటాయింపు సజావుగా సాగేనా ?

న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నది అన్యాయం చేయడానికేనా

మధ్యతరగతి విద్యార్థులకు మద్దతు కరువు

విద్యా కమిషన్ చైర్మన్ వెంటనే స్పందించాలి

పేద వైద్య విద్యార్థులకు ఆసరా దొరకడం లేదు

సీఎం సార్ దయ చూపండి అంటూ పేద విద్యార్థులు వేడుకుంటున్నారు

దామోదర దారి చూపండయ్యా..అంటూ అడుగుతున్నారు

రిజర్వేషన్ల అమలును 54 శాతానికి కుదించారు : డాక్టర్ బరిగెల శివ



**జై భీమ్ డెస్క్ (హైదరాబాద్)**

వైద్య సీట్ల కేటాయింపుల్లో వంతదారులకు అవకాశాలు లభించే ఆస్కారం ఉందని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు మద్దతు లభించకపోవుతుండడంతో వైద్య శాఖ మంత్రి దామోదరా దారి చూపండయ్యా అంటూ పేద విద్యార్థులు అడుగుతున్నారన్నారు.అరకోర సీట్లు కాకుండా ఐదు వందలకు పైగా సీట్లు దారిమల్లె ఆస్కారం ఉన్నట్లు న్యాయస్థానాలలో వేయబడిన కోర్టు కేసుల విద్యార్థుల సంఖ్య తెలుపుతుందన్నారు.స్థానికులకు సీట్లు కేటాయించాకే మిగిలిన వాళ్లకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మెరిట్ సాధించిన వైద్య విద్యార్థులకు మొదటి స్థానంలో పక్కాగా సీట్లు కేటాయించి న్యాయం చేయాల్సిందే అంటూ డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఎక్కడ చూసినా సమాజంలో డబ్బులు ఉంటే రూల్స్ కూడా మారిపోతున్నాయని వివిధ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని విశ్లేషించారు.న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నది అన్యాయం చేయడానికేనా అంటూ నిలదీశారు.స్థానికత ఆధారంగా నాలుగు సంవత్సరాలు స్థానిక ప్రాంతంలో చదివిన వాళ్లకు మొదటి ప్రియారిటీ కింద సీట్లు కేటాయించాలన్నట్లు జీఓలో పొందుపరచారన్నారు.ఓవరాల్ గా అన్ని సీట్లకు రిజర్వేషన్స్ కల్పిస్తారా కళాశాల వైస్ రిజర్వేషన్ తీసుకుంటారా స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు.జాతీయస్థాయిలో ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపు తెలంగాణలో మొదటిసారిగా తర్జన భర్జన పడుతున్నారన్నారు. స్థానికత నిర్ధారించబడిన విద్యార్థుల ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించిన తర్వాతనే మిగతా వాళ్లకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.ఎస్సీలకు 15 శాతం ఎస్టిలకు 10 శాతం బీసీలకు 29 శాతం సీట్లను కేటాయిస్తూ ఆయా రిజర్వేషన్ల విద్యార్థులకు న్యాయం చేకూర్చేబడే విధంగా జీవో నెంబర్ 33 లో క్షుణ్ణంగా పొందుపరచారన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు 54 శాతం రిజర్వేషన్ల సీట్లను కేటాయిస్తూ

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## గొర్రెల పథకంలో వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

3

దర్యాప్తులో గుర్తించిన ఇడి అధికారులు

## కానిస్టేబుళ్ల ఫలితాలు విడుదల

అమరావతి,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్): ఏపీలో 6,100 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో హోంమంత్రి అనిత వీటిని విడుదల చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఆర్.కె.మీనా పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గండి నానాజి 168 మార్కులతో ప్రథమ స్థానంలో, జి.రమ్య మాధురి (159) రెండో స్థానంలో, మెరుగు అచ్యుతారావు(144.5) మూడో స్థానంలో నిలిచారు.

## హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు

రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టాం


త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు

2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి

దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది మన రాష్ట్రమే

గూడెం చెరువులో పెన్షన్లు అందచేసిన సిఎం చంద్రబాబు

3



## నిరంతరం ప్రజల పక్షాన నిలబడి స్ఫూర్తినిచ్చే పత్రికా సంస్థలు కొన్నిమాత్రమే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

స్వతంత్ర సంగ్రామ కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపి అందరినీ ఒక వేదికపైకి తేవడంలో పత్రికలు అపారమైన కృషి చేశాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు కొన్ని వింత పోకడలు పాత్రికేయ రంగానికి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నవ తెలంగాణ దినపత్రిక 10 వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి స్ఫూర్తినిచ్చే పత్రికా సంస్థలు కొన్ని మాత్రమే ఉంటాయని, అలాంటి కోవలో నవ తెలంగాణ ఒకటని ఈ సందర్భంగా అభినందించారు. కమ్యూనిస్టుల

- మిగతా 2లో..



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# స్థానికత 'లోపం' శాసిస్తుంది

మొదటి పేజీ తరువాయి

మిగిలిన 46 శాతం కలిగిన సీట్లను ఎవరికి కేటాయిస్తారో జీవోనెం 33లో పొందుపరచలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు ఉద్యమకారులు కుల సంఘాలు మేధావులు, కవులు కళాకారుల గొంతు ఒక్కసారిగా మూగబోయిందన్నారు. పేద వైద్య విద్యార్థులకు ఇంతగా అన్యాయం జరుగుతుంటే ఒక్క విద్యార్థి సంఘం నాయకుడు ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. ఇంతటి ఉదాంతం జరుగుతుండగా విద్యా కమిషన్ చైర్మన్ సీనియర్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి స్పందించకపోవడం బాధాకరమన్నారు. వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణ కర్తవ్యంలో భాగంగా విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాల్సింది పోయి కోర్టునాశ్రయిస్తున్న వ్యక్తులకు ప్రభుత్వం తరఫున సహకారం అందించే విధంగా పావులు కదుపుతున్నారని తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. న్యాయ నిపుణుల సలహాలు ఏ విధంగానైనా ఉన్నప్పటికిని అధికార వర్గం పేద విద్యార్థులైన స్థానికులవైపా పరాయి వాళ్ళ వైపా స్పష్టంగా తేల్చలేకపోతున్నారన్నారు. అన్ని కళాశాలలకు కలిపి కేటాయించబడుతున్న సీట్లలో రిజర్వేషన్లను ఏ విధంగా కల్పిస్తారో స్పష్టంగా తెలుపాల్సి ఉందన్నారు. జీవో 33 నియమాలను ప్రతి కళాశాల సీట్ల కేటాయింపులో పక్కాగా అమలుపరుస్తుందా దాటవేస్తుందా వేచి చూడాలన్నారు. పేద వైద్య విద్యార్థులకు సహకారం లభించకపోవడం ఎంతటి మోసమో తెలంగాణ సమాజం పసిఘట్టాలన్నారు. అవసరం లేని కాడ అక్కర లేని కాడ తీవ్రమైన ఉద్యమాలను కొనసాగించే విద్యార్థి ఉద్యమ సంఘాలు నేడు రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపుల్లో పేద వైద్య విద్యార్థులకు అన్యాయం జరగబోతుందని తెలిసినప్పటికిని స్పందిస్తుండకపోవడం బాధాకరమన్నారు. స్థానికేతరుల గురించి సంబోధించిన, ఉచ్చరించిన అధికారులకు నాయకులకు ఎక్కడ లేనంత కోపం వస్తుందన్నారు. తెలంగాణ ప్రాంతం అంటేనే అన్నిటికీ ఓర్చుకొని సర్వం కోలిపోతున్నామని తెలియవస్తున్నప్పటికీ వాటన్నిటిని సరిదిద్దడం కోసం నామమాత్రపు ప్రయత్నాలను కొనసాగించడం సరికాదన్నారు. అయ్యా సీఎం రేవంత్ రెడ్డి సార్ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా మీ బాధ్యత పట్ల ఎవ్వరికి ఎలాంటి సందేహం, అనుమానం లేనప్పటికిని ప్రభుత్వ విలువల్ని దిగజార్చడం కోసం జరుగుతున్న ప్రయత్నాలను మాత్రం ఖచ్చితంగా గుర్తించాల్సింది మీరేనని తెలంగాణ ప్రజలు తెలంగాణ వాదులు పేద వైద్య విద్యార్థులు న్యాయ నిపుణులు, అధికారులు, గుర్తుకు చేస్తున్నారన్నారు. డబ్బుంటే రూల్స్ కూడా మారిపోయే స్థాయికి వ్యవస్థల పరిస్థితులు దిగజారిపోతున్నాయని గుర్తుకు చేశారు. వైద్య విద్య అనేది దేశంలోనే అత్యంత ప్రధానమైన విద్యగా గుర్తింపు కలిగి ఉంటున్నప్పటికీ రాష్ట్ర పరిధిలో జరుగుతున్న వైద్య విద్య పోరాటాన్ని ప్రభుత్వం ఒక్కటే ఉన్నపాటుగా తగిన న్యాయం చేస్తూ సవరించగలదన్నారు. అందరూ అన్యాయం జరిగిందని న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నప్పుడు జీవో 33 కు వ్యతిరేకంగా ఏవిధమైన అన్యాయం జరిగిందో కూడా తెలంగాణ సమాజానికి తెలియజేస్తే బాగుంటుందన్నారు. న్యాయస్థానాలలో నమోదు చేయబడుతున్న కేసులను చూసి న్యాయమూర్తులు సైతం నిద్రపోతున్నారన్నారు. గత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానికతను నిర్ధారించాల్సింది ప్రభుత్వా లేనంటూ సునాయాసంగా తెలియజేయడం రాష్ట్ర విద్య వైద్య విద్యార్థుల భవిష్యత్తును ఒక్కసారిగా గుర్తుకు చేసిందన్నారు. తలకు మించిన పని భారమొ సహాయ పడగల గుణమొ తెలియదు గాని వైద్య విద్యార్థులకు జరగబోతున్న అన్యాయాన్ని మాత్రం తప్పకుండా సవరించాల్సిందేనంటు స్పష్టం చేశారు. తెలంగాణలో రాజకీయ వేడి జోరుగా సాగుతుండగా ప్రభుత్వ పక్షం ప్రతిపక్షం మధ్య జరుగుతున్న వైరుధ్యాల దృష్టిలో వైద్య విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిలే ఆస్కారం కనిపిస్తుందన్నారు. ఎవరు స్పందించిన ఎవరు స్పందించక పోయినా సీట్లు లభించన విద్యార్థులు మరో పోరాటానికి సిద్ధపడబోతున్నట్లు ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో సీట్ల కేటాయింపు అంత ఆశమాసిగా కొనసాగే ఆస్కారం కనిపించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 33 వైద్య కళాశాలలు నిర్మాణం చేపట్టబడడం అత్యద్భుతమన్నారు. సాధించుకున్న తెలంగాణలో వైద్య విద్యార్థులకు ఉజ్వాల భవిష్యత్తును ఇవ్వడం కోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను నిర్మించి గత ప్రభుత్వం మంచి పని చేసిందన్నారు. గత సంవత్సరం కోల్పోయిన 135 సీట్లకు గాను తెలంగాణ పేద వైద్య విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. డిగ్రీ పీజీ లతో కలుపుకొని ఇంచుమించుగా 8 సంవత్సరాలు స్థానిక లోపాన్ని భరించడం ప్రస్తుత సమయంలో సాధ్యపడుతుందా అంటూ ప్రభుత్వానికి గుర్తు చేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కఠినమైన నిర్ణయాలైన కాలానుకూలాలను ఐక్యపరచడం కోసం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్య విద్యకు, ప్రైవేటు వైద్య విద్యకు ఎక్కడ లేనంత తేడా ఉందని ప్రభుత్వ వైద్య విద్యార్థుల విద్యా భవిష్యత్తు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రైవేటు వైద్య విద్య సంస్థలకు దీటుగా పేద విద్యార్థి వైద్య బిడ్డలను తయారుచేసి తెలంగాణ రాష్ట్రానికి చెందిన పేద ప్రజలకు ఉచిత వైద్య సౌకర్యాలను కల్పించబడే విధంగా బలోపేతం చేస్తూ వైద్య సీట్ల కేటాయింపును నిర్ణయించాలన్నారు. అన్ని కళాశాలలో కలుపుకొని ఉన్నటువంటి మొత్తం సీట్లకు గాను వైద్య ర్యాంకు సాధించిన విద్యార్థులు 8500 సీట్ల కోసం పోటీపడుతుండగా ఎంతమంది విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా సీట్లు రాబోతున్నాయో పరీక్షించుకోవాలన్నారు. ఉన్నపాటుగా ప్రభుత్వం ఒక్కటే పేద వైద్య విద్యార్థులకు సహాయపడుతూ అండగా నిలవగలదని సూచించారు. అధికారులపై నాయకులపై వస్తున్న అపనమ్మకాన్ని సత్య ప్రచారాలను పూడ్చిపెట్టడం కోసం స్థానికత నిర్ధారణ విషయంలో స్థానికత ఆధారంగా చదువుకున్న విద్యార్థులకు మాత్రమే మొదటి ప్రాధాన్యత, ప్రధాన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపినారు పేద వైద్య విద్యార్థుల ఆశయ లక్ష్యాలను అడ్డుకుంటే తెలంగాణ రాష్ట్రం రానున్న కాలంలో వల్లకాడుగా మారిపోయే ఆస్కారం ఏర్పడి ఇదే తరహా దోరణిని ఎల్లకాలం కొనసాగిస్తూ తెలంగాణ సమాజానికి తెలంగాణ ప్రజలకు తెలంగాణ ప్రాంతానికి స్థానికతకు తెలంగాణకు చెందిన పేద వైద్య విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం అపాయం, పెను ప్రమాదం తీసుకొచ్చే ఆస్కారం ఉందన్నారు. ప్రభుత్వ పాలకులు ,అధికారులు నిర్లక్ష్యం వహిస్తారా నిజనిర్ధారణకు వస్తారా వేచి చూడాలన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకం

**ఆటో మ్యుటేషన్ పక్రియకు శ్రీకారం**
**పక్రియను పరిశీలించిన కలెక్టర్**

**విజయవాడ,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

ఆటో మ్యుటేషన్ పక్రియకు శ్రీకారంచుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని.. ఇదో విప్లవాత్మకమైన మార్పు అని, కొత్త విధానంలో ఒకేరోజు ఒకే చోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలోని 17 మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ అవుతున్న పక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్యలక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ పక్రియను స్టెప్ 1 మొదలు స్టెప్ 7 వరకు చివరగా మ్యుటేషన్ సర్టిఫికేట్ జనరేట్ అయినంత వరకు పక్రియను పరిశీలించారు. ఇదంతా అరగంటలోనే పూర్తికావడంతో ఇరు పార్టీలు ప్రభుత్వ సేవల్లో వేగంపై ఆనందం వ్యక్తం చేశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్రలు లబ్ధిదారుకు మ్యుటేషన్ సర్టిఫికేట్ అందజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఆస్తి రిజిస్ట్రేషన్ తర్వాత మునిసిపల్ రికార్డుల్లో యజమాని పేరు మారాలంటే రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్లతో మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడం, అక్కడ ఆ పక్రియ పూర్తికి కూడా కొంత సమయం పట్టడం జరుగుతుండేదని.. ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ఆటో మ్యుటేషన్ వల్ల ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుందని.. మునిసిపల్ డేటా బేస్‌లో ఆటోమేటిక్‌గా యజమాని పేరు మారిపోతుందని వివరించారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ జరిగిపోతుందన్నారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతాయన్నారు. రిజిస్ట్రేషన్, మునిసిపల్ డిపార్టుమెంట్ల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. సేవలపై ప్రజలకు విశ్వాసాన్ని, సంతృప్తి స్థాయిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆటోమ్యూటేషన్ మంచి ఉదాహరణ అని.. ఈ విధానాన్ని అందుబాటు-లో ఉంచిన గౌరవ ముఖ్యమంత్రికి ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు- కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆటో మ్యుటేషన్ అనేది పట్టణ డిజిటల్ పాలనలో కీలక మైలురాయి అని.. మ్యుటేషన్ కోసం మునిసిపల్ కార్యాలయానికిగానీ వార్డు సచివాలయానికిగానీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యుటేషన్ పూర్తవుతుందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. దీనివల్ల రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మునిసిపల్ డేటా బేస్‌లో పేరు నమోద వుతుందని పేర్కొన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ పక్రియ ప్రారంభమైందని తెలిపారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని ధ్యానచంద్ర కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ-ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రష్యాతో చమురు బేరం కొనసాగుతుంది

**భారత్ తన వాణిజ్య అవసరాల మేరకు నడుచుకుంటుంది**
**ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో విదేశాంగ ప్రతినిధి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ):**




భారత్‌పై 25 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో పాటు- రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆచితూచి స్పందించింది. ఆ రెండు దేశాలు పతనమైన ఆర్థిక వ్యవస్థలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చెప్పడానికి ఏమీ లేదని భారత్ పేర్కొంది. ముఖ్యమైన ఎజెండాపైనే తమ రెండు దేశాలు దృష్టి సారించాయని, అదే విధంగా రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం నాడిక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. భారత్-అమెరికా దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొందని తెలిపారు. ఇందుకు అనుగుణంగానే ముఖ్యమైన ఎజెండాపైనే తాము దృష్టి సారించామని చెప్పారు. ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని విశ్వసిస్తున్నట్టు-ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సంబంధాల్లో అమెరికాతో భారత్ బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఇవి మరింత బలపడ్డాయని చెప్పారు. ఏ రెండు దేశాల మధ్య సంబంధాలు మూడో దేశం కోణంలో చూడకూడదని, వివిధ దేశాలతో మన సంబంధాలు వేటికవే సొంత అర్హతలు కలిగి ఉన్నాయని జైశ్వాల్ అన్నారు. భారత్-రష్యా సంబంధాలపై మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య నిలకడైన సంబంధాలు ఉన్నాయని, కాలపరీక్షకు నిలిచిన భాగస్వామ్యం తమదని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగానే తమ నిర్ణయాలు ఉంటాయని, దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంతో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుని భారత్ ముందుకు సాగుతుందని అన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు.

# నిరంతరం ప్రజల పక్షాన నిలబడి స్ఫూర్తినిచ్చే పత్రికా సంస్థలు కొన్నిమాత్రమే

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మొదటి పేజీ తరువాయి

ఆధ్వర్యంలోని పత్రికలు ప్రజల పక్షాన నిలబడి





చైతన్యం చేయడంలో విశేష కృషి చేశాయి. అందరికీ ఆదర్శంగా నిలబడ్డాయి. ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంతో పాటు బాల్య వివాహాలు, కులాల మధ్య అంతరాలు, జోగినీ వ్యవస్థ.. వంటి సమాజంలోని అనేక రుగ్మతలపై ప్రజలను చైతన్యం చేశాయి. చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నడిచే పత్రికల పాత్ర మరువలేనిది. ఇప్పుడు పాత్రికేయ రంగంలో కొన్ని వింత పోకడలు వచ్చాయి. తమ సంపాదనను కాపాడుకోవడానికి, వారిని ప్రశ్నిస్తున్న వారి పట్ల అసహ్యకర భాషను ఉపయోగించి ప్రత్యర్థుల ప్రతిష్టను దెబ్బతీయడానికి కొన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మీడియా సంస్థలు రావడం వల్ల జర్నలిస్టు అనే పదానికి అర్థం వెతుక్కోవలసిన దుస్థితి తలెత్తింది. జర్నలిస్టు ముసుగులో రాజకీయ పార్టీల కోసం ముందుకొస్తున్న వారిపట్ల సమాజం నిశితంగా గమనించాలి. అలాంటి వారు వేరన్న విషయాన్ని అసలు సిసలైన జర్నలిస్టులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. నిబద్ధత కలిగిన జర్నలిస్టులు ఈ వింత పోకడలపై సదస్సులు నిర్వహించి నిజమైన జర్నలిస్టులు ఎవరన్నది నిర్వచనం చెప్పాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీల నేతలు చేస్తున్న ప్రకటనల పట్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతున్న క్రమంలో జర్నలిస్టు కూడా అదే దారిలో వేగంగా పరుగెత్తుతున్నారు. నిజమైన జర్నలిస్టులకు, ఆ ముసుగులో వస్తున్న వారికి మధ్య ఒక లక్ష్మణ రేఖను గీయాల్సిన అవసరం ఉంది. ఆ పని జరక్కపోతే పత్రికలకే కాదు, దేశ భద్రతకే ప్రమాదం ఏర్పడుతుంది. జర్నలిస్టుల ముసుగు తొడుక్కుని విద్రోహ చర్యలకు పాల్పడిన సంగతి ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కొందరిని అరెస్టు చేసిన ఘటనల్లో వెలుగులోకి వచ్చాయి. సామాజిక స్థితిగతులను అర్థం చేసుకోవడం, సంక్షేమ పథకాల్లో లోటుపాట్లను సరిదిద్దుకోవడంతో పాటు పరిపాలనలో పట్టు సాధించాలంటే పత్రికల్లో విశ్లేషణాత్మక కథనాలు ఎంతో అవసరం. తప్పులు జరక్కుండా పరిపాలన అందించాలన్న ఉద్దేశంతో అలాంటి వాటిని నేనెప్పుడూ గమనిస్తూనే ఉంటా. అబద్ధాల పునాదులపైన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకుంటే అది ఏదో ఒకరోజు కూలుతుందని విశ్వసించే వాడిని...” అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, నవ తెలంగాణ సాహితీ సంస్థ ఇంచార్జి తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్, పత్రిక సంపాదకులు రాంపల్లి రమేష్ తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

**మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం**
**800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం**

**నల్లగొండ,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అ÷-కితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థ్యం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

## సంపాదకీయం

# విపత్తు సాయం కోసం ప్రత్యేక దళం !

విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది.విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్దంగా ఉండేలా చూడాలి. ఈ దిశగా ఆలోచ నలు చేసి ఆచరణకు సిద్దపడాలి. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్టీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం.. అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

**7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ**
**నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ**
**సెప్టెంబర్ 9న ఎన్నిక...అదేరోజు ఫలితం ప్రకటన**

**న్యూఢిల్లీ,ఆగస్టు1(జై భీమ్ న్యూస్):**

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు- వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.




# హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు

**రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టాం**
**త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు**
**2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి**
**దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది మన రాష్ట్రమే**
**గూడెం చెరువులో పెన్షన్లు అందచేసిన సిఎం చంద్రబాబు**



**కడప,ఆగస్టు1(జై భీమ్ న్యూస్):**

హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని గూడెం చెరువులో చేనేత కార్మికురాలు అలివేలమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు సీఎం పింఛను అందజేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక వరకు సీఎం ఆటోలో వెళ్లారు. అక్కడ నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టామని, త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తి చేసి చెరువులన్నీ నింపుతాం అని తెలియజేశారు. సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకుంటే కరువు అనేదే ఉండదని, రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉపాధి కోసం యువత వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదని, త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని, రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎపి రూ. 14 వేలు, కేంద్రం రూ. 6 వేలు మొత్తంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వబోతున్నాం అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పింఛను ఇచ్చే రాష్ట్రం ఏపీ అని సీఎం చంద్రబాబు అన్నారు. అర్హులైన వితంతువులకు సాయం చేస్తున్నామని చెప్పారు. పింఛన్ల విషయంలో మన తర్వాత తెలంగాణ, కేరళ ఉన్నాయన్నారు. పేదలకు సాయం చేస్తే కలిగే తృప్తి మరిదేంట్లోనూ రాదని చెప్పారు. ఈ సందర్భంగా జగన్, వైకాపా నేతల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగితే మాపై విషం చిమ్మారు. అనేక మాటలు మారుస్తూ నాపై అభాండాలు వేసి అసత్యాలు రాశారు. మహిళా ఎమ్మెల్యేపైనా దూషణలకు దిగుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురించి ఇష్టానుసారంగా నోరుపారేసుకున్న వ్యక్తిని మందలించాల్సింది పోయి ఇంకా రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తి జగన్. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలి. నాయకుడే రెచ్చగొడితే ఇక కిందిస్థాయి నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడతారు. ప్రతిచోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండాలి. మభ్యపెట్టి, మోసం చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు. సాక్షి పత్రికలో వచ్చిందని నమ్మితే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లేనని అన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. 2028 డిసెంబర్ నాటికి తొలి దశ పనులను పూర్తిచేయాలని స్పష్టంగా ఆదేశాలిచ్చా. స్టీల్‌ప్లాంట్‌తో జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మంచి కార్యక్రమాన్ని చెడగొట్టడం.. పడగొట్టడం ఈజీ.. నిలబెట్టడమే కష్టం. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు- విధ్వంసం చేశారు.. కేంద్ర పథకాలను నిలిపివేశారు. తల్లికి వందనం హామీని నిలబెట్టుకున్నాం.. ఏడుగురు పిల్లలున్నా ఇచ్చాం. అమెరికాకు గ్రాండ్ క్యానియన్‌లా మనకు గండికోట ఉంది. దాన్ని ఆకర్షణీయ ప్రాంతంగా తయారు చేస్తాం. అక్కడ రూ.85కోట్లతో పనులు ప్రారంభిస్తాం. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు- చేస్తాం. గతంలో గండికోట ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తిచేశా. హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టాం. 2024 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు సీట్లు గెలిచాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు- గెలిపించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు అన్నారు. మంత్రి సవిత, ఎ÷-మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా

**వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఇసి**
**సబంధిత అధికారల వద్ద అభ్యంతరాల పరిశీలన**

**న్యూఢిల్లీ,ఆగస్టు1(జై భీమ్ న్యూస్):**

బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించింది. ఓటర్లు ఇసిఐ వెబ్‌సైట్‌లో వారిపేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇసిఐ జాబితా ప్రకారం.. జూన్‌లో ఎస్ఐఆర్ ప్రారంభం కావడానికి ముందు బీహార్‌లో 7.93 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. అయితే తాజాగా విడుదలై ముసాయిదా జాబితాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తెలియాల్సి వుంది. ముసాయిదా జాబితా ప్రచురణతో పాటు- ' క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల' ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఇది సెప్టెంబర్ 1 వరకు కొనసాగనుంది. ఈ సమయంలో ముసాయిదాలో పేర్లను తప్పుగా తొలగించారనే ఫిర్యాదులు ఉన్నవారు సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు. ఈ ఏడాది చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇసిఐ బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం.. ఇటీవల రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియ అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. అయితే, ప్రస్తుతానికి ఈ ముసాయిదా జాబితాలో చేర్చిన వివరాలు ఇంకా వెబ్‌సైట్‌లో పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కానీ, ఓటర్లు ఈసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను చెక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ జాబితాలో సవరణలకు నెల రోజులు అంటే సెప్టెంబరు 1 వరకు గడువు కల్పించారు. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులుగా భావించినవారి పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయొచ్చని అధికారులు స్పష్టంచేశారు. ముసాయిదా జాబితాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు రాష్ట్రంలో 7.93 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ చేపట్టగా.. కీలక విషయాలు బయటపడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజక వర్గాలకు మారినట్లు- ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండుచోట్ల ఓటు- నమోదు చేసుకున్నట్లు- అధికారుల పరిశీలనలో తేలింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

# మాలెగావ్ కేసులో కొత్త విషయాలు

**ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ అరెస్టుకు అప్పట్లో కుట్ర**
**మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ప్రకటన**

**న్యూఢిల్లీ,ఆగస్టు1(జై భీమ్ న్యూస్):**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబయిలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన క్రమంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాటి యూపిఎ హయాంలో జరిగిన ఈ కేసులో సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్‌పై నేరం మోపారు. తాజా తీర్పుతో ఆమెతో పాటు పలువురు నిర్దోషులుగా తీర్పువచ్చింది. ఈ క్రమంలో నాటి కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ మాట్లాడుతూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో ఇప్పుడు ఈ విషయం సంచలనంగా మారింది. అంటే ఇదంతా కుట్రపూరితంగా సాగిందని తెలుస్తోంది. శుక్రవారం ముజావ్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు- మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు- ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం.. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూర్చడంతో పాటు- అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు- వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు- రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదైంది. ఈ కేసుపై ముంబయిలోని ప్రత్యేక కోర్టులో గురువారం విచారణ జరగ్గా.. నిందితులందరి నీ నిర్దోషులుగా ప్రకటించింది. ఇదంతా ఒక ఎత్తయితే ముజావ్ చేసిన ప్రకటన ఇప్పుడు ప్రకంపనలు రేపనుంది.

# గొర్రెల పథకంలో వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

**దర్యాప్తులో గుర్తించిన ఇడి అధికారులు**

**హైదరాబాద్,ఆగస్టు1(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం అమలులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు అవినీతిపై దృష్టి సారించారు. డబ్బు భారీగా చేతులు మారిన కారణంగా ఇడిరంగంలోకి దిగింది. గత ప్రభుత్వంలోని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా ఉన్న జి. కల్యాణ్ కుమార్, ఇతర లబ్ధిదారులు, మధ్యవర్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఆధారాలు సేకరించినట్లు- ఈడీ అధికారులు ప్రకటించారు. వివిధ ప్రభుత్వ అధికారులకు ముడుపుల రూపంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు- సూచించే పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 200కుపైగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, డెబిట్ కార్డులు, 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక కూడా గొర్రెల పంపిణీలో కుంభకోణం జరిగినట్లు- గుర్తించింది. మార్చి 2021తో ముగిసిన కాలానికి సంబంధించిన కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో పథకం అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు- వెల్లడైంది. లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా ఇన్వాయిస్ రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, నకిలీ వాహన నంబర్లతో కూడిన ఇన్వాయిస్‌కు చెల్లింపులు చేయడం వంటివి గుర్తించారు. చనిపోయి/???నికిలో లేని వ్యక్తుల పేరుతో కూడా గొర్రెల యూనిట్లను కేటాయించినట్లు- తేలింది. మొత్తం తెలంగాణవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగాయని ఈడీ అంచనా వేసింది. ఈ కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత, ఇంకా ఎంతమంది అక్రమాలకు పాల్పడ్డారనే విషయంపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన






**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు**

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

ప్రతి సంవత్సరం తల్లిపాల ప్రాముఖ్యతపై ఒకటి ఆగస్టు నుండి ఏడు ఆగస్టు వరకు నిర్వహించడం జరుగుతున్నది. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అధ్యక్షతన సికేఎం హాస్పిటల్ వరంగల్ నందు తల్లిపాల వారోత్సవాల పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు వారి కుటుంబీకులు పాల్గొని ఈ తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివరావు మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డకు తల్లికి మధ్య అనుబంధం పెరుగును అని తెలిపినారు. తల్లిపాలు బిడ్డ త్రాగడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగును. పోషకాలు గలిగిన ఆహారము అందును. జీర్ణశక్తి పెరుగును. అస్తమ ఊబకాయము రాకుండా ఉండును. మానసికంగా అభివృద్ధి చెంది చురుకుగా ఎదుగుదల ఉండును అని అన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన బరువు తగ్గునని గర్భాశయము సాధారణ స్థితికి వచ్చునని క్యాన్సర్లు రాకుండా ఉంటాయని మానసిక ప్రశాంతత ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రతి బిడ్డ తన తల్లిపాలు తాగే హక్కును పొందెటట్లు చూడాలని వివరించినారు. ఈ తల్లిపాల వారోత్సవాలు నేటి నుండి వారం రోజుల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ సిబ్బంది సమన్వయంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారని వివరించినారు. ప్రజలు తప్పనిసరిగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకొని బిడ్డకు ముర్రుపాలు అందిటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, సికెఎం హాస్పిటల్ సూపరిండెంట్, ఆర్ఎంఓ డాక్టర్ మురళి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అర్చన, సంబంధిత సిబ్బంది గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు మొదలగువారు పాల్గొన్నారు.

# జేఎన్ఎస్ లో తాత్కాలికంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు నిర్ణయం





## స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలోని సదుపాయాలు, వసతులను కల్పించి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఇక్కడే తాత్కాలికంగా ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నామని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా మైదానాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను గురించి అధికారులకు సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ అశోక్ కుమార్ ను స్టేడియంలో వసతి సౌకర్యాలపై వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహృదయంతో, వరంగల్ జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మంజూరు చేయాలనీ అడిగిన వెంటనే ఒప్పుకున్నారని తెలిపారు. అలాగే వెంటనే స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తో త్వరితగతిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఆగస్టు నుండే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, అలాగే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. బిసిసిఐని సంప్రదించి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నిధులు, అలాగే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అందులో భాగంగానే జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని తాత్కాలికంగా ప్రారంభించడానికి ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జేఎన్ఎస్ ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చెయాలనీ స్పోర్ట్స్ అథారిటీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలోనే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రారంభించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడాధికారి గుగులోతు అశోక్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ, కుడా, మున్సిపల్ అధికారులు, నాయకులు, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# భీమారం పాఠశాలలో విద్యార్థులకు స్కూలు బ్యాగుల పంపిణీ

**విద్యార్థులందరూ చదువుతూ ఎదగాలి**
**విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
**భీమారం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీనివాస్**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

హాసన్ పర్తి మండలం భీమారం ఉన్నత పాఠశాలలో మరియు ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి 8వ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థులందరికీ ఈరోజు హైదరాబాదుకు చెందిన మార్క సురేష్, మార్క నవత పాఠశాలలోని విద్యార్థులకు స్కూలు బ్యాగుల పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన మార్క సురేష్ సివిల్ ఇంజనీర్ గా పనిచేస్తూ, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఇంజనీరుగా ఎదిగానని, విద్యార్థులందరూ చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని, భవిష్యత్తులో గొప్ప స్థాయిలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీనివాస ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల అవసరాలను తీర్చడానికి తాము కృషి చేస్తున్నామని పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతో పాటు వారి ఇతర సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ, భవిష్యత్తులో గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ బైరాన్ పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీధర్, సరోజ, సల్మా సుల్తానా, మస్రత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరించిన జాగృతి నేతలు





**జై భీమ్ న్యూస్ కే యూ క్యాంపస్**

బిసి బిల్లు 42% పైన పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదం తెలపాలనే డిమాండ్ తో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇందిరా పార్క్ వేదికగా తలపెట్టిన 72 గంటల నిరాహార దీక్ష సంబంధిత పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం ఈరోజు కాకతీయ యూనివర్సిటీ లోనీ ఫస్ట్ గేట్ ముందు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథి గా జాగృతి రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్,హాజరై గోడ ప్రతులను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసి బిల్లు పైన అవలంబిస్తున్నా, ద్వంద నీతి పైన శ్రీకాంత్ గౌడ్, నిప్పులు చేరిగారు, బిసి బిల్లు కవిత ద్వారానే సాధ్యపడుతుందని దాని కోసం ఉద్యమిస్తున్న మా అధినేత్రి శ్రీమతి కవిత నిరాహార దీక్ష కు సబ్బండా బిసి కులాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు శ్రవణ్, శ్రీధర్, రాకేష్, అనిల్, జన్ను సంతోష్,ఉదయ్, భరత్, సుతేజ్, తాండ్ర భాస్కర్ కుసుమ రాజు, గణిపాక చరణ్, మధు వాంఛనగిరి తదితర పిజి విద్యార్థులు పాల్గొన్నారు.

# కే.యూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మహమ్మద్ హబీబుద్దీన్





**జై భీమ్ న్యూస్, కేయూ క్యాంపస్**

కాకతీయ విశ్వవిద్యాలయ నూతన ఫైనాన్సు ఆఫీసర్ గా డాక్టర్ మహమ్మద్ హబీబుద్దిన్, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం నుంచి బాధ్యతలు స్వీకరించారు, తోట రాజయ్య ఉద్యోగ విరమణ చెందటం తో ఈ ఖాళి ఏర్పడింది, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ హబీబుద్దిన్ ను అబినందించారు. జేఎన్ఎస్ లో తాత్కాలికంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు నిర్ణయం.

# ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మహిళా ఉద్యోగులకు ఘన సన్మానం

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన సహాయ రిజిస్ట్రార్ గంపా సరళ దేవి పాటు, ల్యాబ్ అటెండెంట్ టి. శోభారాణి, బుక్ కీపర్ కమల, కమతాన్‌లు ఎల్లమ్మ, సుజాత, డైనింగ్ హాల్ హెల్పర్ జే. సరోన లను విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగినుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం నేడు మధ్యాహ్నం విశ్వవిద్యాలయ అతిథి గృహంలో జరిగింది. బోధనేతర ఉద్యోగ సంఘ మహిళా కార్యదర్శి బి. కృష్ణవేణి నేతృత్వంలో, ఉద్యోగ విరమణ చేసిన మహిళా ఉద్యోగులను శాలువా, బొకే, జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిజిస్ట్రార్ లు ఆర్. శ్రీలతాదేవి, కే. శ్రీలత, సూపరింటెండెంట్ లు పి.నర్మద. హేమా రాణి, స్వరూప రాణి, పద్మావతితో పాటు మహిళా ఉద్యోగిని లు పాల్గొన్నారు.



## పోలీస్ డ్యూటీ మీట్ విభాగంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ /ఫోటోగ్రాఫర్ కు బంగారు పతకం



**జై భీమ్ న్యూస్ హనుమకొండ**

నిన్న ప్రారంభమైన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ మన్నవ మోహన కృష్ణ ప్రొఫెషనల్ ఫోటో గ్రఫీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించి భద్రాద్రి పోలీస్ జోన్ కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు పోటీలు





**జై భీమ్ న్యూస్ హనుమకొండ**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వరంలో మామునూరు పిటిసి వేదికగా నిన్న ప్రారంభమైన రెండవ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్, రోజువ రోజు విజయవంతంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజన్కె నేడు డ్యూటీ మీట్‌లో భాగంగా శుక్రవారం బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాలకు సంబంధించి నాలుగు విభాగాలు, కంప్యూటర్, వీడియాగ్రఫీ సైటిఫిక్ ఏయిడ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ రెండవ రోజున నిర్వహిస్తున్న పోటీలను పర్యవేక్షించడంతో పాటు డ్యూటీ మీట్ ఏర్పాట్లపై ఈ పోటీల్లో పాల్గోన్న పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోగా, డ్యూటీ మీట్ ఏర్పాట్లు బాగున్నాయని ముఖ్యంగా వసతి,భోజన ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ డ్యూటీ మీట్ ఏర్పాట్లను ఏర్పటికప్పుడు పర్యవేక్షించిన అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్,శ్రీనివాస్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ పోటీలు రేపటితో ముగుస్తాయని. రేపు సాయంత్రం ఐదు గంటల నుండి జరగబోయే ముగింపు వేడుకలను ముఖ్య అతిధిగా రాష్ట్ర పోలీస్ డీజీపీతో డా. జితేందర్‌తో పాటు, జైళ్ళ విభాగం డీజీపీ డా.సౌమ్య మిశ్రా విశిష్ట అతిధిగా పాల్గోంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## మూడవీధుల పురోగతిని వరిశీలించిన తెలంగాణా రాష్ట్ర దేవాదాయ స్థపతి

**వరంగల్ జై భీమ్ న్యూస్**

తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి వల్లీనాయగం, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అధికారుల అభ్యర్ధన మేరకు వరంగల్ నగరానికి విచ్చేసి శ్రీ భద్రకాళీ దేవాలయ మాడవీధుల ప్రగతిని పరిశీలించి తమ సంతృప్తిని వ్యక్తపరిచారు. అనతి కాలంలోనే ఇంత వైభవంగా మాడవీధుల పనిని శరవేగంగా పూర్తిచేస్తున్నందుకు కుడా అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి దక్షిణం వైపు మాడవీధుల నిర్మాణానికి కుడా అధికారులకు కొన్ని సూచనలు చేశారు. కుడా అధికారులు వాటిని ఆమోదించి ఆలయ కార్యనిర్వహణాధికారి ద్వారా శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆమోదానికి వెంటనే పంపిస్తామని తెలియజేశారు. స్థపతి వెంట భద్రకాళి శేషు అయ్య, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ కుమార్, కుడా పి.ఓ అజిత్ రెడ్డి, ఈ.ఈ భీంరావు, డి.ఈ.ఈ. రఘుబాబు, ఏ.ఈ.ఈ. వరుణ్, కాంట్రాక్టరు శ్రీధర్ రావు తదితరులున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి అమ్మవారి దర్శనం అనంతరం మాడవీధులు పనులను పరిశీలించారు. వీరివెంట కార్పోరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, ధర్మకర్తలు శ్రవణ్ కుమార్ రెడ్డి సుగుణ, మయూరి, స్రవంతి, పూర్ణచందర్, సతీష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు. శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా దేవాలయానికి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు.



# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి





**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి**

**అధికారులు పారిశుద్ధ్యం, తాగునీటి, విద్యుత్ సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

పలు పథకాల కింద చేపట్టి కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల నియోజకవర్గం పరిధిలోని 15,16,17 డివిజన్ల పురోభివృద్ధిపై నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ భాజ్ పాయి లతో కలిసి బల్దియాలోని మేయర్ సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 15,16,17 డివిజన్లలో అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్యం నిర్వహణ, మంచినీటి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు మాట్లాడుతూ...సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టాంప్ డ్యూటీ నిధులతో మూడు డివిజన్లో సుమారు 727 లక్షల రూపాయలతో 32 అభివృద్ధి పనులు చేపట్టగా అందులో దాదాపు కోటి రూపాయల వ్యయంతో 18 పనులు పూర్తయినాయని, కోటి రూపాయల వ్యయంతో కొనసాగుతున్న రెండు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగాలని, మురుగు కాలువలలో పూడికలు తీయడంతోపాటు, చెత్త సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వేయడం జరగాలన్నారు. డివిజన్లలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ నీటి ప్రెషర్ వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలన్నారు.స్వచ్ఛమైన మంచినీటిని అందించుటకు ట్యాంకులు ఎప్పటికపుడు శుభ్రం చేస్తూ వాటి వివరాలు ఆయా ట్యాంకులపై ప్రదర్శించాలన్నారు. గాడిపల్లిలో మంచినీటి పైప్లైన్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. బల్దియాకు సంబంధించిన వార్డ్ ఆఫీసర్, పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా, విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు, బల్దియా టోల్ ఫ్రీ నెంబర్లు మూడు డివిజన్లోని ఈ 11 గ్రామాల కూడలిల గోడలపై ప్రదర్శించాలని, ఏమైనా సమస్య ఉత్పన్నమైతే ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షిస్తూ... 404 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించగా అందులో 296 మంది లబ్ధిదారులకు మంజూరు చేయగా, మిగిలిన 108 ఇళ్లను త్వరితంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ధర్మారంలో మహిళల కొరకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రేటర్ వరంగల్ లోని 66 డివిజన్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్ట్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంచార్జ్ ఎస్ ఈ మహేందర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జ్ ఎస్ ఈ, సీపీలు మహేందర్, రవీందర్ రాధాకర్, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేయూ ప్రాంగణంలో ఎన్.సి.సి. శిక్షణ నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడేట్లు జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలలో పాల్గొంటారు







**క్యాంపు కమాండెంట్ ఎస్ ఎస్ రామా దురై**

**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఎన్. సి.సి.పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో సి ఎ టి సి -6 ట్రైనింగ్ క్యాంపు జరుగుతున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. 759 మందితో గత తొమ్మిది రోజుల నుండి క్యాంపు రిపబ్లిక్ డే ,బెస్ట్ కడే ట్స్, కల్చరల్ ,ఫ్లాగ్ ఏరియా, డ్రిల్ వాటిపై ప్రత్యేక నిపుణులు శిక్షణ ఇచ్చి, రిపబ్లిక్ డే పరేడ్ కోసం పాల్గొనే క్యాడేట్లకు లో కఠోరమైన శిక్ష ఇస్తున్నట్లు. వీరు 2026 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర పర్యటనలో పాల్గొంటారని క్యాంప్ కమాండెంట్ ఎస్ఎస్ రామాదురై తెలిపారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వాయిస్ సేన క్యాంపును సందర్శించడానికి ఏపీ అండ్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఎన్. సి. సి.హాజరయ్యారని, ఈరోజు ప్రత్యేకంగా ఐదు ఈవెంట్లలో నిష్ణార్థులను గుర్తించి నిపుణులచే శిక్షణ ఇచ్చినట్లు సాయంత్రం కదేట్స్ కు నాయకత్వ లక్షణాలు పట్టుదల విజేతలుగా నిలవడానికి క్రీడలు నిర్వహించి వారికి బహుమతులు అందజేస్తామని క్రీడా స్ఫూర్తితో పోటీ తత్వాన్ని పెంచి మరింత పాజిటివ్, వ్యక్తిత్వ వికాసాన్ని ,నైపుణ్యాలను, మెరుగుపరచడం ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశమని రేపటితో ఈ క్యాంపు ముగుస్తుందని రామదురై తెలిపారు. ఈరోజు వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ నెంబర్కర్ వీర చక్ర, వరంగల్ గ్రూప్ శిక్షణ అధికారి ఇతర ఉమ్మడి ఖమ్మం ,వరంగల్ జిల్లా ఎన్. సి.సి అధికారులు మరియు క్యాంపు శిక్షణలో ఉన్న పద్ధతులను వివరించారు క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కెప్టెన్ డాక్టర్ పి సతీష్ , కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, సుబేదారి మేజర్ జై రామ్ సింగ్, రవీందర్, సౌరస్య, అజీత్ కదం, సందీప్, క్వాటర్ మాస్టర్ సుతారి, సందీప్ పవార్, లెఫ్టెంట్ గణేష్, సంతోష, దిపక్, నిఖలేష్,రాధాకృష్ణ, రాజమాణిక్యం, జీవన్, భవాని,సంధ్య , కళ్యాణి, సూపర్నెంట్ అరుణ, కుమారస్వామి, దత్తు, సతీష్ , మహేష్, పాల్గొన్నారు.

## జిల్లాలో నూతన పరిశ్రమలకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలో నూతన పరిశ్రమలకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన యూనిట్లకు వచ్చిన దరఖాస్తులు, పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన అనుమతులు, ఆయా శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న వాటి వివరాలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. టీ ప్రైడ్ పథకం కింద ఆరు యూనిట్లకు సబ్సిడీ మంజూరైందని జిఎం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమలకు కావాల్సిన చట్టపరమైన అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తులను త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం గురించి వివిధ కులవృత్తుదారులకు, యువతకు అవగాహన కల్పించి పథకానికి దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ గురించి నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించి ఉపాధి అవకాశాలు పొందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు సమన్వయంతో అనుమతులు మంజూరు చేయాలన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపన పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వైవి గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, రవాణా శాఖ ఎంవీఐ వేణుగోపాల్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ సునీత, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, డిటిడిఓ ప్రేమకళ, టీజిఐఐసీ మేనేజర్ మహేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య, జిడబ్ల్యూఎంసి డిప్యూటీ కమిషనర్ రవీందర్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, కుడా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు రద్దు

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అందరికీ తెలిసిందే..! తొలి విడతలో ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వచ్చే ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, ఒకేసారి భారీ స్థాయిలో గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధతలో ఉన్నారు. అయితే తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 1,950 మంది అనర్హులు ఈ పథకం ద్వారా ఇళ్లు పొందినట్లు గుర్తించారు. దీంతో అధికారుల నిర్ణయంపై చర్యలు తీసుకుంటూ, వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. ప్రభుత్వం అర్హులకే ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో పక్కగా చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అనర్హులకూ ఈ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. వారు అప్‌లోడ్ చేసిన ఫొటోల ఆధారంగా, ముందుగానే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన వారికి కూడా అప్రూవల్స్ లభించాయి. ఈ విషయంపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ సీరియస్‌గా తీసుకున్నారు. బేస్‌మెంట్ పూర్తయిన తరువాత తొలి విడతలో రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ అనర్హులను గుర్తించినట్లు ఎండీ గౌతమ్ తెలిపారు. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి, వారి స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని ఆయన చెప్పారు. అంతేకాక, దీనికి బాధ్యులైన పంచాయతీ సెక్రటరీలను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో సొంత భూమి ఉండి, ఇల్లు లేని వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామని గౌతమ్ స్పష్టం చేశారు. కానీ తనిఖీల్లో బయటపడిన 1,950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి బేస్‌మెంట్ వరకూ నిర్మించారని పేర్కొన్నారు. అధికారుల తనిఖీల ప్రకారం, పథకం కింద దశల వారీగా అనేక స్థాయిల్లో పరిశీలన, అనంతరం కలెక్టర్ ఆమోదం ద్వారా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. అయినప్పటికీ కొన్ని చోట్ల గల అలసత్వం వల్ల అనర్హులకు కూడా ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ అంశంపై అధికారులు తగిన చర్యలు తీసుకుంటూ, పథకం నిజమైన అర్హుల చేతికి చేరేలా చర్యలు ముమ్మరం చేశారు.




## సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్టుల సంఘం వినతి పత్రం



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలను నివారించుటకై సుప్రీంకోర్టు విడుదల చేసిన 15 మార్గదర్శకాలను విద్యాసంస్థలలో విద్యా సంస్థలలో కౌన్సిలర్లను ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు మరియు కోచింగ్ సెంటర్లతో పాటుగా గురుకులాలలో కౌన్సిల్ సైకాలజిస్ట సేవలు ఉపయోగించుకోవాలని శాసనసభలో సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలని 2021 మార్చి 16న రాజ్యసభలో అక్కడి నుండి లోక్సభకు వెళ్లి మార్చి 21న బిల్ పాస్ అయింది కావున మన స్టేట్ లెవెల్ లో అదేవిధంగా సైకాలజిస్టుల కౌన్సిల్ బిల్లు ఏర్పాటు చేయాలని స్టేట్ అసెంబ్లీలో పాస్ కావాలని కోరుతూ ప్రతి ఒక్క స్టేట్లో ఎల్ఇడెన్ హెల్త్ కేర్ కౌన్సిల్ ఇంప్లిమెంట్ చేయాలని సెంట్రల్ గవర్నమెంట్ ఆక్ట్ 2020-21 అని వివరిస్తూ వినతిపత్రం గౌరవ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నందు తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ హనుమకొండ ప్రెసిడెంట్ గంగిశెట్టి శ్రీవిద్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కే మురళీధర్, డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివుడు, హనుమకొండ డిస్టిక్ సెక్రటరీ డి.కళ్యాణి, డిస్టిక్ లేడీ ప్రెసిడెంట్ బి సునీత తదితర తెలంగాణ సైకాలజిస్టుల సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఉప వర్గీకరణ రోస్టర్ విధానమును పున సమీక్షించాలి

**మాల మహానాడు డిమాండ్**



**చౌటుప్పల్ బీజై భీమ్ న్యూస్**

ఎస్సీ ఉప వర్గీకరణ రోస్టర్ విధానమును పున సమీక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ఉప వర్గీకరణ చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజును విద్రోహ దినంగా పాటిస్తూ శుక్రవారం మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణ రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జీవో రాకముందు ఇచ్చిన అడ్మిషన్ నోటిఫికేషన్, ఉద్యోగ నోటిఫికేషన్ లలో వర్గీకరణ అమలు చేయరాదని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. చౌటుప్పల్ మండలంలో రాజీవ్ యువ వికాసం పథకంలో మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఎడ్ల లింగస్వామి, సంగం నరసింహ, జువ్వి రఘుపతి, దౌడీ యాదగిరి, ఆవుల గణేష్, తగరం వెంకటేశం, యనమల నాగరాజు, జువ్వి శివ, సాతిరి భానుచందర్, ఆవుల గణేష్, కట్ట శంకర్, మనే కుమార్, గోలి స్వామి, మాద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ

**ముఖ్యఅతిథిగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజిఎం టి సతీష్**

**చౌటుప్పల్, జై భీమ్ న్యూస్**

శ్రీ చైతన్య స్కూల్ చౌటుప్పల్ బ్రాంచ్ లో శుక్రవారం రోజున శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో మరియు సంప్రదాయం బద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులు బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. పోతరాజులు ఆటలు సాంప్రదాయ డబ్బులు వాయిద్యాలు మరియు జానపద నృత్యాలతో పండుగ మాదిరిగా సాగింది ఈ పండుగ సందర్భంగా విద్యార్థులకు బోనాల ప్రాముఖ్యత తెలంగాణ సాంస్కృతి మరియు సాంప్రదాయాలపై శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయం టి సతీష్ అవగాహన కల్పించారు ఈ కార్యక్రమం చివర్లో ప్రిన్సిపల్ శ్వేత భాను మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయాలను నిలబెట్టాలని ఉద్దేశంతోనే పాఠశాలలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐఎం వెంకట్రెడ్డి కోఆర్డినేటర్స్ రఘువంశి కామేశ్వరి ప్రీతి ఏవో గోపీచంద్ డీన్ దుర్గాప్రసాద్ ప్రైమరీ ఇంచార్జ్ పరమేశ్వరి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## అలా ఎన్‌కౌంటర్ నుంచి బయటపడ్డా

**ఆనాటి ఘటనపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

తనను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేసినట్లు- ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ టీ-వీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. నాడు జరిగిన సంచలన విషయాలను వివరించారు. తాను హిందువాహినిలో చేరి యువతను ధర్మం వైపు ఆకర్షితులయ్యేలా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో తమ కార్యక్రమాలకు ఎప్పుడూ ఏదో ఒక గొడవ సృష్టించేవారని, తాము ఎక్కడికి వెళితే అక్కడ 144 సెక్షన్ అమలు చేసేవారని రాజాసింగ్ తెలిపారు. ఎవరైనా హిందువులను మతం మార్చాలని ప్రయత్నిస్తే తాము అడ్డుకునే వాళ్లమన్నారు. మా వల్ల ఏదో ఒక గొడవ జరుగుతోందని అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ కుట్రలు చేసింది. లేనిపోని కేసులు పెట్టి జైలుకు పంపారు. అప్పుడు కూడా ఆగలేదు. జైలుకు వెళ్లాం బయటకు వచ్చాం. మళ్లీ ధర్మం కోసం కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇలా ఎన్‌కౌంటర్ మిస్టరీని కూడా బయటపెట్టారు. కాంగ్రెస్ హయాంలో మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేశారని రాజాసింగ్ తెలిపారు. నన్ను, నాతో పాటు- ఓ హిందూవాహిని కార్యకర్తను అడివిలోకి తీసుకెళ్లారు. ఎన్‌కౌంటర్ చేయడానికి ప్లాన్ చేశారు. నన్ను ఎన్‌కౌంటర్ చేయబోయే పోలీస్ కట్టర్ హిందు. నా గురించి ఆయనకు తెలియదు. ఉన్నతాధికారులు నన్ను ఎన్‌కౌంటర్ మాత్రమే చేయాలని ఆయనకు చెప్పారు. ఆ పోలీసు నన్ను అడవిలోకి తీసుకెళ్లి జీపు నుంచి కిందికి దింపారు. పరిగెత్తమని చెప్పాడు. ఆయన తన గన్ లోడ్ చేసుకుంటున్నాడు. అప్పుడే నాకు అర్థం అయ్యింది నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని.. 'ఉరకడం ఎందుకు సార్.. ఇక్కడే కాల్చేయండి.' అని నేను ఆ పోలీసు అధికారికి చెప్పాను. ధర్మం కోసం చావాలనే మా కల ఇక్కడే చంపేయండి అని చెప్పాను. దీంతో ఆ పోలీసు అధికారి ఆలోచనలో పడ్డారు. వీళ్లు ధర్మం గురించి మాట్లాడుతున్నారేంటి? అని ఆలోచించారు. ఇంతకు మీరు ఎవరు? అని ఆ ఆఫీసర్ అప్పుడు మమ్మల్ని అడిగారు. దాదాపు రెండు గంటల పాటు- మా చరిత్ర ఆయనకు చెప్పాం. మిమ్మల్ని చంపి ఉంటే పెద్ద పాపం అయి ఉండేది అని ఆ పోలీస్ ఫీల్ అయ్యారు. దీంతో కొన్ని ఛానెల్స్‌కి ఆ పోలీసే స్వయంగా 'రాజాసింగ్‌ను ఎన్‌కౌంటర్ చేయబోతున్నారు.' అని మీడియాకు లీక్ చేశారు. దీంతో టీవీల్లో ఈ వార్త వచ్చింది. దీంతో నన్ను ఎవరైతే ఎన్‌కౌంటర్ చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారో వాళ్లే ఆపేయాలని ఈ అధికారికి ఫోన్ చేశారు. అలా ఎన్‌కౌంటర్ నుంచి బయట పడ్డామని రాజాసింగ్ సంచలన విషయాలు బయటపెట్టారు.

## సిఎంకు కాళేశ్వరం కమిషన్ నివేదిక అందచేత

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధికారులు అందచేశారు. నీటిపారుదల శాఖ సెక్రెటరీ ప్రశాంత్ పాటిల్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు కమిషన్ నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీ-ని నియమించింది. నీటిపారుదల శాఖ సెక్రెటరీ, న్యాయ శాఖ సెక్రెటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా నియమిస్తూ ఏర్పాటు- చేసిన ఈ కమిటీ- ఈ నెల 4న నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని రాష్ట్ర కేబినెట్ కు సమర్పించనుంది.

## సిఎం రేవంత్‌పై కేసు కొట్టివేత

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. భాజపా ఫిర్యాదుతో రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో సీఎం ప్రసంగం వల్ల భాజపా పరువుకు భంగం కలిగిందని ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల కోర్టు విచారిస్తున్న ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ జరిపిన హైకోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది.

## జగన్ లిక్కర్ డెన్‌ల డాన్: ఆదినారాయణ

**కడప,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని పీ5గా భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అభివర్ణించారు. ఐదో 'పి'ని 'పవర్‌ఫుల్' అని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం గూడెం చెరువులో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి లోకేశ్‌ను తండ్రికి మించిన తనయుడంటూ సీఎం చంద్రబాబు ఎదుటే ప్రశంసించారు. ఈ క్రమంలో జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. జగన్ లిక్కర్ డెన్‌ల డాన్. సూపర్ సిక్స్ పథకాలతో కడప జిల్లాలో జగన్‌కు సూపర్ చెక్ పెడతాంఅని ఆదినారాయణరెడ్డి అన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు.

## ఎన్నికల అక్రమాలపై అణుబాంబు లాంటి ఆధారాలు

**ఇసిపై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ అక్రమాలకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని అన్నారు. ఈ ఓట్ల చోరీ అక్రమాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని.. బిజెపి కోసం ఇసి ఓట్లను చోరీ చేస్తోందని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ధ్వజమెత్తారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొత్తగా కోటి ఓట్లు- చేర్చారని పేర్కొన్నారు. ఇసి అక్రమాలపై ఆరు నెలలపాటు- దర్యాప్తు చేశామన్నారు. అణుబాంబు లాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ఆ అణుబాంబు పేలితే ఎన్నికల సంఘమే ఉండదని హెచ్చరించారు. ఇసిలో అక్రమాలకు పాల్పడిన ఏ స్థాయి అధికారినైనా, ఒకవేళ రిటైరైనా వదిలి పెట్టామని స్పష్టం చేశారు.

## గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం

**సిఎం శర్మతో టిటిడి ఛైర్మన్ భేటీ**

**తిరుమల,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

అస్సాం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానంచర్యలు చేపట్టింది. ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం భేటీ- అయ్యారు. గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కీలక అంశాలపై సీఎంతో తితిదే ఛైర్మన్ చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు. దీనికి స్పందించిన సీఎం హిమంత.. ఐదు ఎకరాల స్థలంతోపాటు- ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. తమ రాష్ట్ర రాజధానిలో తిరుమల శ్రీవారి అద్భుతమైన ఆలయం నిర్మించాలని తితిదే నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పగా భావిస్తున్నట్లు సీఎం అన్నారు. తితిదే ఆధ్వర్యంలో నిర్మించబోయే శ్రీవారి ఆలయం ద్వారా హిందూధర్మ పరిరక్షణ, సంప్రదాయాలు, హిందుత్వ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## పరామర్శల పేరుతో ఉద్రిక్తతలు పెంచుతున్న జగన్: జివి

**గుంటూరు,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

పరామర్శ పేరుతో యాత్రలు, ర్యాలీలు చేపట్టి జగన్ ఉద్రిక్తతలను పెంచుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బందిపోటు దొంగల కంటే జగన్ ప్రమాదకరమైన వ్యక్తి అని జీవీ ఆంజనేయులు విమర్శించారు. రూ.3,700 కోట్ల అక్రమార్జన కోసం జే బ్రాండ్లు తాగించి ప్రజల ప్రాణాలు బలిగొన్నారన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వితంతు పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా జైలుకెళ్లి మొసలి కన్నీళ్లా?మహిళలను కించపరిచేవాళ్లు, దూషించేవాళ్లను ప్రోత్సహించడమే జగన్ పని. ఆయన అవినీతి ఆకలి, అరాచకాల కారణంగానే ఎంపీ మిథున్‌రెడ్డి జైలు పాలయ్యారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి




### రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు-డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు-డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కై-కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంగీత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు- సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు- తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.




# కింగ్డమ్ పార్ట్ -2 పై అప్పుడే ప్రకటన

విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్ట్ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.




# మహావతార్ నరసింహకు జనం నీరాజనం

పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడించారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.

# అజయ్‌గా.. యోగి ఆదిత్యనాథ్ బయోపిక్

### చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరణ

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటు-డు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల ఎనిమిదేళ్లుగా ప్రజలకు అందుబాటు-లో ఉన్నప్పుడు ఎటు-వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.